ప్రజావాణి సమస్యలను సత్వరం పరిష్కరించాలి

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి, ఏప్రిల్ 28: ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే అర్జీలకు రెవెన్యూ అధికారులు పరిష్కారం చూపాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 95 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వీణ, కలెక్టర్ పరిపాలన అధికారి మసూద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఒకేఒక ఫిర్యాదు..

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్28: తాడ్వాయి తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒకేఒక ఫిర్యాదు వచ్చిందని తహసీల్దార్ రహీమమొద్దీన్ తెలిపారు. తాడ్వాయిలోని ఏడో వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంఈవో రామస్వామితోపాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పగలే వెన్నెలాయే..

హన్మాజీపేట్‌లో మధ్యాహ్నం వెలుగుతున్న స్ట్రీట్ లైట్

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 28: అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యుత్ వృథా అవుతున్నది. ప్రతి రోజూ ఉదయం వీధి దీపాలను బంద్ చేయాల్సిన గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో పగలు కూడా అవి వెలుగుతూనే ఉన్నాయి. మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో విద్యుత్ వృథా అవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. హన్మాజీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని సంగ్రాం తండాలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. రెండు రోజులుగా వీధి దీపాలు వెలుగుతున్నా.. వాటిని ఎవరూ బంద్ చేయడం లేదు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించి, విద్యుత్ వృథాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

తరచూ ప్రమాదాలు జరిగే స్థలాల పరిశీలన

ప్రమాదాలు జరిగే స్థలాలను పరిశీలిస్తున్న పోలీసలు, అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: ఎల్లారెడ్డితోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల ప్రమాదాలు జరిగిన స్థలాలను ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై బొజ్జ మహేశ్ ఆయా శాఖల అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఎల్లారెడ్డిలో పలు ప్రదేశాలు, హాజీపూర్, హాజీపూర్ సడాక్ తండా, కొట్టాల్, జంగమాయిపల్లి, పెద్దారెడ్డి పెట్రోల్ ప్రాంతం, కళ్యాణి ప్రాజెక్టు, శివ్వాపూర్, మీసన్‌పల్లిలో ప్రమాదాలు జరిగిన స్థలాలు పరిశీలించారు. ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆక్సిడెంటల్ రిజల్యూషన్ టీమ్ నివేదికను తయారుచేసి ఎస్పీకి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై విక్రయాలు ఇలా.. రాకపోకలు సాగేదెలా..?

ఎల్లారెడ్డి గాంధీచౌక్‌లో రోడ్డుకిరువైపులా కూరగాయలు, పండ్లు విక్రయిస్తున్న వ్యాపారులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: ఎల్లారెడ్డి పట్టణంలోని కిరాణా మార్కెట్ నుంచి గాంధీ చౌక్ వరకు రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, పండ్లు విక్రయిస్తున్నారు. రోడ్డు చిన్నదిగా ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. 7, 8, 9, 10వ వార్డుల ప్రజలు గాంధీ చౌక్ మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డును ఆక్రమించి వ్యాపారస్తులు రోజూ విక్రయాలు సాగిస్తున్నారు. కిరాణా మార్కెట్‌కు వస్తువులను తీసుకువచ్చే ఆటోలు, లారీలు కూడా ఈ రోడ్డు మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. రోడ్డును ఆక్రయించి వ్యాపారాలు సాగిస్తుండడంతో.. కిరాణా దుకాణాలకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపై నిలపాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పోలీసులు తమ వాహనాల ఫొటోలు తీసి ఫైన్ విధిస్తున్నారని పలువురు వాహనదారులు వాపోతున్నారు. కూరగాయలు, పండ్ల విక్రయాలను క్లబ్ రోడ్‌లో ఏర్పాటు చేసినా, ఇంటిగ్రేడెట్ మార్కెట్ స్థలాన్ని శుభ్రం చేయించి, అక్కడికి చిరు వ్యాపారులను తరలించినా ఎంతో బాగుంటుందని పట్టణ ప్రజలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రజతోత్సవ సభకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

బాన్సువాడ బల్దియా మాజీ వైస్ చైర్మన్ జుబేర్

బాన్సువాడ, ఏప్రిల్ 28: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ కవిత, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సూచనలతో నియోజకవర్గం నుంచి పది వేల మందికి పైగా కార్యకర్తలు సభకు తరలివెళ్లినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గానికి నాలుగు పర్యాయాలు వచ్చి పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపిన కవిత, బాజిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ విజయఢంకా మోగిస్తుందని, సీఎం కేసీఆర్ సీఎం అవుతారని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

సీనియర్ సిటిజన్‌లకు కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనివ్వాలి

కామారెడ్డి డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్లు

ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనివ్వాలని కోరుతూ సీనియర్ సిటిజన్లు కామారెడ్డి డిపో మేనేజర్ కరుణశ్రీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లను వారికి కేటాయించిన సీట్లలో కూర్చోనివ్వని పక్షంలో ఆ బస్సు కండక్టర్‌ను బాధ్యుడిని చేయాలన్నారు. బస్టాండ్‌లో తాగునీటి వసతి కల్పించాలని, వాష్‌రూమ్‌లు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజిన్ ఫోరం అధ్యక్షుడు పున్న రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి రాజన్న, ఉపాధ్యక్షుడు డాక్టర్ పీవీ నరసింహం, సంయుక్త కార్యదర్శులు మోహన్‌రెడ్డి, రామ్‌కిషన్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ నర్సింహులు

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని భిక్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు జొన్నలను 14శాతం మించకుండా తేమ ఉండేలా ఎండబెట్టి, శుభ్రపరిచి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.3,371 చెల్లిస్తుందని తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భిక్నూర్ మాజీ ఉపసర్పంచ్ గోనె శ్రీకాంత్, రైతులు సాయిరెడ్డి, బాపురెడ్డి, శ్రీకాంత్, మహేందర్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

మే 4 నుంచి
ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

కామారెడ్డి,ఏప్రిల్ 28: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మే 4వ తేదీ నుంచి మే 31 వరకు ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు కామారెడ్డి క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండీ మోజాం అలీ ఖాన్, కార్యదర్శి ముప్పారపు ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 నుంచి 23 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు మే 4వ తేదీలోపు ఇందిరా గాంధీ స్టేడియంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిబిరం ప్రతి రోజూ ఉదయం ఆరు నుంచి ఎనిమిది, సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు తెల్లని క్రికెట్ దుస్తులు, కాన్వాస్ షూ, క్రికెట్ కిట్ తమవెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9666677786 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి
నివారణ టీకాలు వేయించాలి

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: రైతులు తమ పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మత్తమాల పశువైద్యురాలు అర్చన అన్నారు. మండలంలోని సోమార్‌పేట్, మౌలాన్‌ఖేడ్ గ్రామాల్లో పశువులకు సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రెండు గ్రామాల్లో కలిపి మొత్తం 38ఆవులు, ఎడ్లు, 107గేదెలకు టీకాలు ఇచ్చారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు లింగంపేటకు మంత్రి పొంగులేటి

లింగంపేట, ఏప్రిల్ 28: మండలంలోని శెట్పల్లి గ్రామానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం రానున్నారు. గ్రామంలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులో మంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొంటారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫాంపాండ్స్ తవ్వించుకోవాలి

లింగంపేట, ఏప్రిల్ 28: బోరుబావులు ఉన్న ప్రతి రైతూ ఫాంపాండ్స్ తవ్వించుకోవాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండలంలోని ఎల్లమ్మ తండాలో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఫాంపాండ్స్ తవ్వకంతో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కూలీల హాజరు, మస్టర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు ఉన్నారు.

వృద్ధుడు అదృశ్యం

ఘన్‌సింగ్

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్28: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన గాండ్ల ఘన్‌సింగ్ అదృశ్యమైనట్లు తాడ్వాయి ఎస్సై రాజయ్య సోమవారం తెలిపారు. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ గ్రామంలో ఉన్న తన కూతురి వద్దకు వచ్చిన ఘన్‌సింగ్ 14వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడన్నారు. ఘన్‌సింగ్ భార్య సంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మహేశ్(ఫైల్)

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 28: మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బీర్కూర్‌లో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్‌కు చెందిన బుత్తిల్లి మహేశ్(25) కొన్ని రోజులుగా పనిచేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. పిల్లలకు సెలవులు ఉండడంతో అతడి భార్య సాలూరాలోని తల్లిగారింటికి వెళ్లింది. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన మహేశ్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. డాబా పైన నిద్రించిన తల్లి సోమవారం ఉదయం చూసే సరికి ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చెట్టును ఢీ కొన్న కారు : పలువురికి గాయాలు

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 28: బీర్కూర్ మండలం తిమ్మాపూర్ శివారులో సోమవారం జరిగిన ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్‌కు చెందిన ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో తిమ్మాపూర్ తెలంగాణ తిరుమల దేవస్థానానికి సోమవారం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో కారు టైరు పేలి చెట్టను ఢీకొన్నది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందిన ఘటన దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై రాజు తెలిపిన ప్రకారం.. ఇసాయిపేట్ గ్రామానికి చెందిన సంజీవ్(35) కామారెడ్డి గంజ్‌లో డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. ఉగ్రవాయి మైసమ్మ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నది. దీంతో తీవ్ర గాయాలైన అతడిని హైదరాబాద్ తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హైదరాబాద్‌లో చిట్యాల మాజీ సర్పంచ్..

శారద(ఫైల్)

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 28: హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడ్వాయి మండలంలోని చిట్యాల గ్రామ మాజీ సర్పంచ్ అంబీర్ శారద(50) మృతిచెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శారద – మధుసూదన్‌రావు దంపతులు ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో శారద అక్కడికక్కడే మృతిచెందింది. మధుసూదన్‌రావుకు కూడా గాయాలయ్యాయి. శారద 1993 నుంచి 1998 వరకు చిట్యాల సర్పంచ్‌గా పనిచేశారు. చిట్యాలలో సోమవారం నిర్వహించిన ఆమె అంత్యక్రియల్లో పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మెకు విద్యార్థుల సంఘీభావం

అధ్యాపకులకు మద్దతుగా సమ్మె శిబిరంలో కూర్చున్న విద్యార్థులు

కామారెడ్డి/ కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: తమ డిమాండ్ల సాధన కోసం కాంట్రాక్ట్ అధ్యాపకులు చేపట్టిన సమ్మె సోమవారం 10వ రోజుకూడా కొనసాగింది. భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో అధ్యాపకులు చేపట్టిన సమ్మెకు విద్యార్థులు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ రమాదేవి, సరిత, నరసయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే

బీబీపేట్, ఏప్రిల్ 27: ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం అర్హులను గుర్తిస్తున్నట్లు ఎంపీవో అబ్బాగౌడ్ తెలిపారు. మండలంలోని మాందాపూర్ గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల ఇండ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు చింతకుంట రాకేశ్‌రెడ్డి, రోడ్డ రాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య సమస్యలపై ..

బాన్సువాడ, ఏప్రిల్ 28: మానసిక ఆరోగ్య సమస్యలపై ఏఐఐఎంఎస్, బీబీనగర్ వైద్య బృందం బాన్సువాడలో సోమవారం సర్వే నిర్వహించింది. మానసిక ఆరోగ్య స్థితి, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడంతోపాటు పెద్దలు, కౌమార దశలో ఉన్న వారి మానసిక సమస్యలపై సర్వే చేపట్టారు. మానసిక ఒత్తిడి, ఆత్మహత్యా ప్రవర్తన, వ్యసనానికి సంబంధించిన రుగ్మతలు తదితర అంశాలపై రెండు రోజుల పాటు సర్వే చేపట్టనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. వైద్య బృందంలో హైదరాబాద్ వైద్యులు వెంకట్, శ్రీధర్, రంజిత్, గ్రేస్, మాధురి, వినీత, బాన్సువాడ డాక్టర్ విజయభాస్కర్, సీహెచ్‌వో దయానంద్ ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రాజంపేట్, ఏప్రిల్ 28: ఫొటో, వీడియోగ్రఫీ రాజంపేట్ మండలం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సామల బాల్‌చంద్రం, ప్రధాన కార్యదర్శిగా ద్యావనపల్లి రమేశ్, కోశాధికారిగా గజ్జెల వెంకటేశ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

అపరిచిత వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

లింగంపేట, ఏప్రిల్ 28: అపరిచిత వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై ప్రకాశ్ ప్రయాణికులకు సూచించారు. సైబర్ నేరాలపై లింగంపేట బస్టాండ్‌లో సోమవారం అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆయనవెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

బాన్సువాడ, ఏప్రిల్ 28: బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని వంద పడకల మాతా శిశు దవాఖాన, స్మార్ట్ బజార్‌లో సైబర్ నేరాలపై షీటీం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులు లేకుండా రేషన్ కార్డులు ఇవాలి

వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రామారెడ్డి (గాంధారి), ఏప్రిల్ 28: ప్రభుత్వం ఎలాంటి తప్పులు లేకుండా కొత్త రేషన్ కార్డులను ఇవ్వాలని తహసీల్దార్ రేణుకాచౌహాన్‌కు పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు అందజేసిన అనంతరం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సతీశ్ మాట్లాడారు. రేషన్ కార్డుల్లో పేరు డిలీట్ చేసుకున్న వారికి కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఆయనతోపాటు మోజీరాం ఉన్నారు.

స్వయం సహాయక సంఘాలకు క్లాత్ పంపిణీ

లింగంపేట, ఏప్రిల్ 28: మండలంలోని ఆయా గ్రామాల స్వయం సహాయక సంఘాల మహిళలకు క్లాత్‌ను సోమవారం పంపిణీ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టేందుకు బట్టను అందజేశామని చెప్పారు. జూన్ 12వ తేదీలోపు యూనిఫామ్‌లు కుట్టి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం చామంతి శ్రీనివాస్, సీఆర్పీలు సత్యనారాయణ, గంగాధర్, మెహర్, రాజు, విజయ్, సంగాగౌడ్, సీసీలు గంగరాజు, శ్రావణ్, మన్సూర్, నజీర్, అంజయ్య, రాజిరెడ్డి, ఎంఐఎస్ స్వప్నతోపాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే భూ భారతి చట్టం

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేటలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ/ నిజాంసాగర్, ఏప్రిల్ 28: భూ వివాదాల పరిష్కానికి భూ భారతి – 2025 చట్టం ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బాన్సువాడలోని శ్రీ లక్ష్మీ నర్సింహా కల్యాణ మండపం, నిజాంసాగర్ తహసీల్ కార్యాలయం, మహ్మద్‌నగర్ రైతువేదికలో సోమవారం నిర్వహించిన భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ధరణిలో లేని వెసులుబాట్లు ప్రస్తుత భూ భారతి చట్టంలో ఉన్నాయని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం గతంలో రైతులు సివిల్ కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం తహసీల్దార్లు, ఆర్డీవో, సబ్ కలెక్టర్, కలెక్టర్ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉన్నందని తెలిపారు. భూ సమస్యలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, వ్యవసాయ శాఖ, మండల ప్రత్యేకాధికారులు, రైతులు పాల్గొన్నారు. నిజాంసాగర్, మహ్మద్‌నగర్ తహసీల్దార్లు భిక్షపతి, సవాయి సింగ్, నాయకులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన సమస్యలన్నీ పరిష్కారం..

లింగంపేట, ఏప్రిల్ 28: అర్హులైన ప్రతి రైతూ సమస్యను భూభారతిలో పరిష్కరిస్తామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. మండలంలోని నల్లమడుగు, నాగారం, శెట్పల్లి గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. శెట్పల్లి సంగారెడ్డిలో నిర్వహించిన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. తాము సాగు చేస్తున్న పంట పొలాలను బర్కరార్, పరంపోగు, సీలింగ్‌లో చేర్చినట్లు తెలిపారు. దీంతో పంట పెట్టుబడి సాయం, రైతు బీమా పథకాలు అందడం లేదన్నారు. తమ భూములకు సంబంధించి పట్టాలు అందించి న్యాయం చేయాలని రైతులు సబ్ కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించిన పత్రాలు జత చేసి దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. గ్రామస్థాయిలో విచారించి సమస్య పరిష్కరిస్తామని వెల్లడించారు. తన పరిధిలో లేని సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కలెక్టర్ వద్ద పరిష్కారం కాని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు తెలిపారు. మూడు గ్రామాల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సురేశ్, నాయబ్ తహసీల్దార్ రాందాస్, గిర్దవార్ కిరణ్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బాన్సువాడ, ఏప్రిల్ 28: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీజీ జేఏసీ బాధ్యులు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీజీ జేఏసీ కార్యదర్శి డాక్టర్ దేవేందర్, అదనపు కార్యదర్శి కుషాల్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఎం.నాగరాజుతో పాటు సాయిరాం, తుల శ్రీనివాస్, దాసరి రమేశ్, పురుషోత్తం, నరహరి, నర్వ శ్రీనివాస్, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలకు తావివ్వొద్దు

బిచ్కుంద (జుక్కల్), ఏప్రిల్ 28: ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్హుల ఎంపికలో అక్రమాలకు తావులేకుండా చూడాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అధికారులకు సూచించారు. జుక్కల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల మండల పరిషత్ కార్యాలయ అధికారులతో సోమవారం సమీక్షను నిర్వహించారు. అర్హుల ఎంపిక పారదర్శకంగా జరగాలని సూచించారు. పేదల సొంతింటి కల నెరవేర్చాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. సమావేశంలో ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసం
సహకార సంఘాల కృషి

రామారెడ్డి(సదాశివనగర్), ఏప్రిల్ 28: సహకార సంఘాలు రైతుల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నాయని జిల్లా సహకరా అధికారి రామ్మోహన్ అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం–2025ను పురస్కర